

పల్సి(బి)కి నీటి సరఫరా

తలమడుగు మండలం పల్సి(బి)వాసుల నీటి ఇక్కట్లపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. 8లో▸



'ప్రాణహిత'కు దక్కని గౌరవం

ప్రాణులకు నెలవుగా పేరుగాంచిన 'ప్రాణహిత' నదికి పాలకుల నిర్లక్ష్యం కారణంగా తగిన గౌరవం లభించడం లేదు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/28.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.



టీటీడీసీ కేంద్రంలో సిద్ధమైన కౌంటింగ్ హాల్

నేడే తీర్పు

- 'ఆదిలాబాద్'లో లోక్‌సభ ఓట్ల లెక్కింపు
- మూడు కేంద్రాల్లో కౌంటింగ్
- 114 టేబుల్స్.. 157 రౌండ్లు
- ఉదయం 9 గంటల లోపు తొలిరౌండ్ ఫలితం
- జిల్లా కేంద్రానికి చేరిన యంత్రాంగం, అభ్యర్థులు
- మరికాసేపట్లో తేలనున్న విజేత

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి వివరాలు
అసెంబ్లీ నియోజకవర్గాలు : 7
మొత్తం ఓట్లు : 16,50,175
పోలైన ఓట్లు : 12,21,563
కౌంటింగ్ కేంద్రాలు : 3
లెక్కింపులో పాల్గొనే సిబ్బంది : 443
తుది ఫలితం వెల్లడయ్యే సమయం : సాయంత్రం 4గంటలు

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, లెక్కించనున్న ఓట్లు, అందుకు అయ్యే రౌండ్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	లెక్కించే ఓట్లు	రౌండ్లు
సిర్పూర్	320	1,63,944	23
ఆసిఫాబాద్	356	1,71,511	23
బోథ్	306	1,65,157	22
ఆదిలాబాద్	292	1,81,136	21
ఖానాపూర్	309	1,62,101	23
నిర్మల్	306	1,85,168	22
ముథోల్	311	1,92,546	23

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సమయం ఆసన్నమైంది. పోలింగ్ ముగిసి 22 రోజులవగా.. ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం మరికాసేపట్లో వెల్లడికానుంది. ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్నారు. అధికారులు ఇప్పటికే అన్ని పూర్తి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటలకు ప్రక్రియ ప్రారంభం కానుండగా 8.45 నుంచి 9గంటల వరకు తొలి రౌండ్ ఫలితం వెల్లడయ్యే అవకాశముంది. బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు నిర్మల్, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల అధికార యంత్రాంగమంతా ఇప్పటికే ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో సందడి నెలకొంది. కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడంచెల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడు చోట్ల కౌంటింగ్ ప్రక్రియ

ఈ పార్లమెంట్ పరిధి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే నిర్వహిస్తున్నారు. ఎంపీ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లాల వారీగా మూడు చోట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును టీటీడీసీలో చేపట్టనున్నారు.
- నిర్మల్ జిల్లాకు సంబంధించి నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఓట్లను సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో లెక్కిస్తారు.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చేపట్టనున్నారు.
- ఈ మేరకు మూడు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈవీఎంలను ఉంచేందుకు అవసరమైన టేబుళ్లతో పాటు కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అల్యూమినియం తీగలతో కూడిన జాలీలు బిగించారు. నిరంతర నిఘా ఉండేలా సీసీ కెమెరాలు అమర్చారు. అభ్యర్థులతో పాటు వారి ఏజెంట్లు కూర్చునేందుకు కుర్చీలను సమకూర్చారు. వెలుతురు స్పష్టంగా ఉండేలా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రతీ కేంద్రంలో మీడియా సెంటర్ అందుబాటులో ఉంచారు.

లెక్కింపు తీరు ఇలా..

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలైన ఓట్లను లెక్కించేందుకు ఆరు నియోజకవర్గాలకు గాను 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. అత్యధిక పోలింగ్ కేంద్రాలు కలిగిన ఆసిఫాబాద్ నియోజకవర్గానికి మాత్రం 16 టేబుళ్లను కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 14,601 పోలవ్వగా వాటి లెక్కింపు కోసం ప్రత్యేకంగా కౌంటింగ్ హాల్‌ను సిద్ధం చేశారు. ఇందు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. టేబుళ్ల వారీగా నంబర్లు వేయడంతో పాటు రౌండ్ వారీగా ఫలితాలు ప్రకటించేందుకు వీలుగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఉదయం 8గంటల నుంచి ప్రారంభించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం 1నుంచి క్రమ సంఖ్య వారీగా చివరి పోలింగ్ కేంద్రం వరకు ఈవీఎంలను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌పై మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, మరో అసిస్టెంట్ ఉంటారు. లెక్కింపు ప్రక్రియ ఆద్యంతం నిఘా నీడలో కొనసాగుతుంది. చివరగా 17సీ ఫాంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూశాక నియోజకవర్గంలోని అన్ని టేబుళ్లపై అభ్యర్థులకు వచ్చిన ఓట్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తారు. ఏఆర్వో ఆ నియోజకవర్గంలో రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లుగా పరిగణించి ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా టీటీడీసీ కేంద్రంలో అందుబాటులో ఉండి రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, మెజార్టీ వివరాలను వెల్లడించనున్నారు. మిగతా కేంద్రాల్లో ఏఆర్వోలు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి..: కలెక్టర్ రాజర్షి షా



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా అన్నారు. జిల్లాకేంద్రంలోని టీటీడీసీ, పాలిటెక్నిక్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు కౌంటింగ్ కేంద్రాలతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత కల్పిస్తున్నట్లుగా వెల్లడించారు. ఆయన వెంట ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, దీపక్ తివారి, లోకేశ్ కుమార్, ఆర్డీవో వినోద్‌కుమార్ ఉన్నారు.

ఉదయం 9 గంటలకల్లా తొలిరౌండ్ ఫలితం

ఉదయం 8 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా 8.45 నుంచి 9గంటల వరకు తొలిరౌండ్ ఫలితం వెల్లడయ్యే అవకాశముందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా తెలిపారు. ఒక్కో రౌండ్‌కు 45 నిమిషాల సమయం పట్టే అవకాశముంటుందని పేర్కొన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలకు సంబంధించి 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. అలాగే ఆదిలాబాద్ 21 రౌండ్లు, నిర్మల్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి 22 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. మొత్తంగా 114 టేబుళ్లలో 157 రౌండ్లుగా ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును ఉదయం 8గంటలకు ఏకకాలంలో ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2గంటల వరకు విజేత ఎవరో తెలిసిపోనుంది. సాయంత్రం 4గంటల తర్వాతే అధికారికంగా ఫలితాన్ని వెల్లడించే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు.

పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1100 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ఐలవ్‌యు ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ నుంచి మావల పోలీసుస్టేషన్ వరకు సామాన్యులకు అనుమతి లేదని పేర్కొన్నారు. అలాగే కౌంటింగ్ ముగిసిన తర్వాత ర్యాలీలు, సభలు నిర్వహించేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు మద్యం షాపులు మూసి ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎంపీ అభ్యర్థులు, ఏజెంట్లు, పాస్‌లు ఉన్నవారికే అనుమతి ఉంటుందని చెప్పారు.

గెలుపెవరిదో..

- సిట్టింగ్ స్థానాన్ని బీజేపీ మళ్లీ దక్కించుకునేనా?
- ఎస్టీ రిజర్వుడ్‌లో కాంగ్రెస్ బోణీ కొట్టేనా..
- అసెంబ్లీ ఓట్లను మించి బీఆర్ఎస్ సత్తా చాటేనా..
- నేటి పార్లమెంట్ ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులు


గొడం నగేశ్


ఆత్రం సుగుణ


ఆత్రం సక్కు



సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజు రానే వచ్చింది.. గెలుపు ఏ పార్టీ అభ్యర్థిని వరిస్తుంది.. పోలింగ్ తర్వాత ఎవరి అంచనాలు ఎలా ఉన్నా.. అనూహ్య ఫలితాలు ఏమైనా సంభవిస్తాయా.. సర్వేలలో పేర్కొంటున్నట్లుగా రెండు పార్టీల మధ్యే పోటీ కనిపిస్తుందా.. లేనిపక్షంలో ఓట్ల సాధనలో మూడు పార్టీల మధ్య పోటాపోటీ ఉంటుందా.. మొత్తంగా ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో ఎవరిది పైచేయి అవుతుంది.. ఓటరు అంచనాలను ఏ పార్టీ అందుకోలేక పోయిందా.. అన్ని విషయాలు రిజల్ట్‌తో స్పష్టం కానుంది.

బీజేపీ నుంచి గొడం నగేశ్, కాంగ్రెస్ నుంచి ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ నుంచి ఆత్రం సక్కు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో నిలిచారు. ఆద్యంతం ప్ర చార హోరు కొనసాగించారు. బీజేపీ నుంచి ప్రధాన మంత్రి

ఇదీ పరిస్థితి..

మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కేటీఆర్ ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించారు. తమ అభ్యర్థి గెలుపు సాధించేందుకు ప్రయత్నాలు చేశారు.

విజయం ఎవరిని వరించేనో..

సిట్టింగ్ స్థానాన్ని బీజేపీ తిరిగి నిలుపుకుంటుందని ఆ పార్టీ ధీమా వ్యక్తం చేస్తుంది. లక్ష ఓట్లకు పైగా మెజార్టీ సాధిస్తామన్న విశ్వాసంతో 'కమలం' నేతలు ఉన్నారు. ప్రధానంగా ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ ప్రాతినిధ్యమే ఉండడంతో పాటు తిరిగి ఈ నియోజకవర్గాల్లో ఓటర్లు విస్తృతంగా ఆదరించారని వారు అంచనాలో ఉన్నారు. ఇదిలా ఉంటే ఎస్టీ రిజర్వుడ్ అయిన తర్వాత కాంగ్రెస్ ఇప్పటివరకు ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో విజయం సాధించింది లేదు. ఈ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో బలమైన నాయకులు పార్టీలో చేరడంతో తమకు కలిసివచ్చిందన్న అభిప్రాయం హస్తం నేతల్లో వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా ఆయా నియోజకవర్గాల్లో తమకే అధికంగా ఓట్లు దక్కుతాయనే ధీమాతో ఉన్నారు. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ పరిధిలోని రెండు నియోజకవర్గాల్లో గెలుపొందినప్పటికీ మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లో కలిపి అత్యధికంగా ఓట్లు సాధించింది తమ పార్టీయేనని బీఆర్ఎస్ నమ్మకంగా ఉంది. ఈ ఎన్నికల్లోనూ అంతకుమించి ఓట్లు సాధించడం ద్వారా గెలుపు సాధిస్తామన్న విశ్వాసం కారు పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

2019 ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్లు..

పార్టీ	ఎంపీ అభ్యర్థి	సాధించిన ఓట్లు
బీజేపీ	సోయం బాపూరావు	3,76,892
బీఆర్ఎస్	గొడం నగేశ్	3,18,665
కాంగ్రెస్	రాథోడ్ రమేశ్	3,14,057

ఎవరు గెలిచినా రికార్డే..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు మంగళవారం కొనసాగనుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ తరఫున ఆత్రం సుగుణ, బీజేపీ నుంచి గోడం నగేశ్, బీఆర్ఎస్ నుంచి ఆత్రం సక్కు బరిలో నిలిచారు. ఈ ముగ్గురి మధ్యనే ప్రధాన పోటీ నెలకొన్నందున ఎంపీగా ఎవరు గెలిచినా కొత్త రికార్డే కానుంది. సక్కు రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా తొలి సారి ఎంపీ బరిలో నిలిచారు. సుగుణ కూడా ఈ ఎన్నికల్లోనే రాజకీయ అరంగేట్రం చేసి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరిలో ఎవరు గెలిచినా తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన వారిగా రికార్డుకెక్కుతారు. ఇక మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన నగేశ్ మరోసారి విజయం సాధిస్తే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండోసారి విజయం సాధించిన వ్యక్తిగా నిలుస్తారు. కాగా, ఈ ముగ్గురు అభ్యర్థులు ఉపాధ్యాయ వృత్తి నుంచే రావడం గమనార్హం.

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. జిల్లాలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్షకు 322 మంది విద్యార్థులకు గాను 275 మంది హాజరయ్యారు. 47మంది గైర్హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు.

బాసరలో భక్తుల రద్దీ

బాసర: వేసవి సెలవులు ముగింపు దశకు చేరడంతో బాసరకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం జ్ఞానసరస్వతీ అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజామున పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. అక్షరాభ్యాస పూజలతో పాటు మొక్కులు తీర్చుకున్నారు. ఈవో విజయరామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో భక్తులకు మజ్జిగ ఉచితంగా అందించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



విత్తన దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

- కలెక్టర్ రాజర్షి షా
- విత్తన దుకాణాల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. షాపుల్లో స్టాక్ వివరాలను డీలర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు కోరిన డిమాండ్ రకం పత్తి విత్తనాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డీలర్లు అక్రమంగా విత్తనాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధైర్యపడొద్దని, జిల్లా యంత్రాంగం తోడుగా ఉంటుందని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

వాఘాపూర్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ రాజర్షి షా సోమవారం సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పాఠశాల పునఃప్రారంభంలోగా పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థుల యూనిఫాంను పరిశీలించారు. కలెక్టర్ వెంట అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బధిరుల పాఠశాలలో ప్రవేశాలు

కైలాస్‌నగర్: కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 1నుంచి 6వ తరగతి ఇంగ్లిష్ మీ డియం, 1 నుంచి పదో తరగతి తెలుగు మీడియంలో ప్రవేశాల కోసం బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సబిత ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి 14 ఏళ్లలోపు కలి గిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశాల కోసం వైకల్య ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, టీసీ, ఆధార్‌కార్డుతో కరీంనగర్‌లోని పా ఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించా రు. ఇతర వివరాలకు 9000221301, 9666868755 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాలిసెట్ ఫలితాలు విడుదల

- జిల్లా విద్యార్థుల ప్రతిభ


షేక్ ఇర్ఫాన్ (40వ ర్యాంకు)


సూర్య రెడ్డి (460వ ర్యాంకు)

ఆదిలాబాద్‌టౌన్: పాలిసెట్ ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ బుర్ర వెంకటేశం సోమవారం విడుదల చేశారు. పాలిసెట్–2024లో భాగంగా జిల్లాలో 939 మంది విద్యార్థులు హాజరు కాగా, ఎంపీసీ విభాగంలో 89.27 శాతం బాలికలు, 79.21 శాతం బాలురు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఎంపీసీ విభాగలో 83.6 శాతం ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఎంబైపీసీ విభాగంలో 88.29 శాతం బాలికలు, 78.26 శాతం బాలురు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 82.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ విభాగంలో ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ ఇర్ఫాన్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాడు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవగా, రాష్ట్రస్థాయిలో 40వ ర్యాంకు సాధించాడు. ఇతడు జైనథ్ ఎంజేపీ పాఠశాలలో విద్యను అభ్యసించాడు. పదో తరగతిలో 9.7 జీపీఏ సాధించాడు. తండ్రి కూలీ పనిచేస్తుండగా, తల్లి చాంద్‌సుల్తానా గృహిణి. ఇటీవల విడుదలైన సీపోఈ ఫలితాల్లో సైతం ఇతడు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంక్ సాధించాడు. వరంగల్‌లో అడ్మిషన్ పొందాడు. అలాగే ఆదిలాబాద్ పట్టణంలోని పోలీసు కాలనీకి చెందిన అముల జీవన్ రెడ్డి–ప్రీతి దంపతుల కుమారుడు సూర్యరెడ్డి రాష్ట్రస్థాయిలో 460వ ర్యాంకు కైవసం చేసుకోగా.. పదో తరగతిలో 9.7 జీపీఏ సాధించాడు.

కాంగ్రెస్ ఏజెంట్లకు శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు, ఎంపీ అభ్యర్థి సుగుణ, శిక్షణకు హాజరైన కౌంటింగ్ ఏజెంట్లు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లకు సోమవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంట్లు గమనించాల్సిన అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేశ్, ఆదిలాబాద్, నిర్మల్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, కూచాడి శ్రీహరిరావు, ఆడే గజేందర్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రాలను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సోమవారం పరిశీలించారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పట్టణంలోని టీటీడీసీ, పాలిటెక్నిక్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆర్డీవో వినోద్ కుమార్‌తో మాట్లాడి ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియపై పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు చంద్రశేఖర్, నవీన్ రెడ్డి, నాగరాజు తదితరులున్నారు.

అందుబాటులో 7లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

కైలాస్‌నగర్: జిల్లాలోని వివిధ మండలాల్లో గల 341 మంది విత్తన డీలర్ల వద్ద 7,01,457 పాకెట్ల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రైతులు తమ సమీపంలోని విత్తన దుకాణాలను సంప్రదించి కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. విత్తన లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో జిల్లా, మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. విత్తన దుకాణాదారులు ఎమ్మార్పీకి మించి విక్రయించినా, విత్తనాలు అందుబాటులో ఉండి కూడా ఇవ్వకున్నా మండల వ్యవసాయ అధికారులకు సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని రకాల పత్తి విత్తనాలు ప్రభుత్వం నుంచి ధ్రువీకరించబడినవేనని ఆయన తెలిపారు. అయితే లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, అలాగే విధిగా రశీదు పొందాలని సూచించారు. పంట కాలం పూర్తి అయ్యేవరకు ప్యాకెట్ కవర్‌తో పాటు బిల్లును భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

'హర్కర'ను కలిసిన ఉమ్మడి జిల్లా నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ పార్టీ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్‌ను తెలంగాణ ఎల్‌పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ అసోసియేషన్ ఈసీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన వెంగళరావ్, సత్యనారాయణగౌడ్, సుభాష్‌రావు, తదితరులు ఉన్నారు.

అడవిపందులు తరలిస్తున్న వాహనం పట్టివేత



వాహనంలో అడవిపందులు

సోన్: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద అడవిపందులు తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఫారెస్టు బీట్ ఆఫీసర్ డి.సుజాత తెలిపారు. ఉమ్రీ నందేడ్ నుంచి నిజామాబాద్ మార్గంలో అడవి పందులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు అప్రమత్తమైన అధికారులు నిర్మల్ వైపు నుంచి వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 13 అడవిపందులు కనిపించాయి. ఒకరు వాహనం దిగి పారిపోగా మరొకరిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని వన్యప్రాణి సవరణ చట్టం ప్రకారం 14 రోజుల జుడీషియల్ కస్టడీకి తరలించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

శుభకార్యానికి వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మారుతి (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: శుభకార్యానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇంద్రవెల్లి మండలం వాల్గొండకు చెందిన మడావి మారుతి (33) కుమురంభీం జిల్లా తిర్యాణిలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బంధువైన వసంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి సోమవారం రాత్రి తిరిగివస్తుండగా ఉట్నూర్ మండలం యేంద సమీపంలో రోడ్డుకు అడ్డువచ్చిన గేదెలను ఢీకొన్నారు. ఘటనలో మారుతి అక్కడికక్కడే మృతి చెందగా వసంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ రాథోడ్ కృష్ణ, ఆత్రం అశోక్ సంఘటన స్థలానికి చేరుకుని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'ప్రాణహిత'కు దక్కని గౌరవం

- పుష్కర నదిగా పురాణ ప్రాశస్త్యం
- తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే అంతర్థానం
- జీవనదిని పట్టించుకోని పాలకులు
- ప్రత్యేక రాష్ట్రంలోనూ దక్కని గుర్తింపు
- పర్యాటకంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్



ప్రాణహిత నది

చింతలమానెపల్లి:అందమైన పరిసరాలు.. ప్రతీ కాలంలోనూ ప్రవహించే నీరు..ఆహ్లాదం అందించే అటవీ ప్రాంతం.. పురాణాల్లో ప్రశస్తి గాంచి పుష్కర నదిగా పేరు పొందిన నది.. వర్షాకాలంలో ఉగ్ర రూపం దాల్చినా అబ్బురపరిచేలా కనిపించే నది.. ప్రాణులకు నెలవుగా పేరు గాంచిన 'ప్రాణహిత'కు తగిన గౌరవం లభించకపోగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోంది.

తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే ముగింపు

ప్రాణహితకు తెలంగాణలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ నది తెలంగాణలోనే పుట్టి తెలంగాణలోనే ముగుస్తుంది. కుమురంభీం జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద ఈనది జన్మస్థలం. వార్దా (పెన్‌గంగ), వైనగంగ నదుల సంగమంతో ఈనది జన్మించింది. కుమురంభీం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లా మీదుగా కరీంనగర్ జిల్లా సరిహద్దులోని కాళేశ్వరం వద్ద గోదావరితో సంగమిస్తుంది. తెలంగాణలోని కుమురంభీం, మంచిర్యాల, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలకు సరిహద్దుగా ఉంది. 113 కిలోమీటర్ల దూరంప్రయాణించే ఈనది గోదావరినది జలాలలో 40 శాతం వాటాను కలిగి ఉంది.

పురాణ ప్రాశస్త్యం కలిగిన పుష్కర నది

ప్రాణహిత నది ప్రస్తావన పురాణాలలో ఉంది. ప్రణీత మహాముని పేరు మీదుగా ఈనదికి ప్రాణహిత పేరు వచ్చింది. హైందవ ధర్మం ప్రకారం పుష్కరాలు నిర్వహించే 12 నదుల్లో ప్రాణహిత 12వ నది. పేరుకు తగినట్టుగా ఈనదీ తీరం జీవవైవిధ్యం కలిగి ఉంటుంది. మహారాష్ట్ర, తెలంగాణలోని ఇరు ప్రాంతాల్లో దట్టమైన అటవీప్రాంతాన్ని కలిగి ఉంది. ఈనదీ తీరంలోనే మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో అరుదైన వృక్ష శిలాజాలు, డైనోసార్ అవశేషాలు లభించాయి. పలు రకాల ప్రాణులకు నిలయంగా ఉంది. తుమ్మిడిహేటి వద్ద చపరాడ ప్రశాంతధాం ఆలయం మొదలు కాళేశ్వరం వరకు పలు ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నాయి. పురాణాల్లో ప్రశస్తి కలిగిన ప్రకారం ఈ నదికి పన్నెండేళ్లకు ఒకసారి పుష్కరాలు వస్తాయి. 2010లో మొదటిసారి, ఆతర్వాత 2022 ఏప్రిల్‌లో పుష్కరాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి నదిలో మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రాణహితకు హారతి ఇస్తున్న స్థానికులు(ఫైల్)



పుష్కరాల్లో ప్రాణహితకు ఇచ్చిన సారె (ఫైల్)

ఆదరణకు నోచుకోని వైనం

ప్రాణహిత నది తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే తన ప్రస్థానాన్ని ముగిస్తుంది. ఈ నదికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాల్సి ఉండగా పాలకుల నిర్లక్ష్యంతో ఆదరణకు నోచుకోవడం లేదు. తెలంగాణ కవులు, గేయకారుల ఆలోచనల్లో గోదావరి, కృష్ణా నదులే తప్పా ప్రాణహిత ప్రస్తావన కనిపించదు. గత ప్రభుత్వ హయాంలో 2022లో పుష్కరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు. నామమాత్రంగా ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకున్నారు. కుమురంభీం జిల్లా తుమ్మిడిహేటి, మంచిర్యాల జిల్లాలోని అర్జునగుట్ట వద్ద ఏర్పాట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రాణహిత నీటిని కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించి పలు జిల్లాలకు తరలిస్తున్నా అప్పటి ప్రభుత్వం పుష్కరాల్లో నిధులు కేటాయించక పోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. గోదావరి, కృష్ణా నదుల పుష్కరాలకు కోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వాలు ప్రాణహితపై చిన్నచూపు చూపడం వివక్షేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీవనదిగా పేరుగాంచిన ప్రాణహిత నదిని ఎన్నికల అంశంగా మారుస్తూ ప్రాణహిత జీవం తీస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

పర్యాటక గుర్తింపు ఇవ్వాలి

ప్రాణహితకు తగిన గౌరవం కల్పించడంతో పాటు పర్యాటక గుర్తింపు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత మాత విగ్రహాన్ని ఏర్పాటు, పర్యాటకులకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. నది పరీవాహకంలోని గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో పర్యాటక స్థలాలను గుర్తించి స్థానికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. కుమురంభీం, మంచిర్యాల జిల్లాలలో పర్యాటకులు సందర్శించేలా ప్రచారం నిర్వహించాలి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనైనా ప్రాణహిత నదికి తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..



ప్రాణహిత నదికి తగిన గౌరవం లభించాల్సి ఉంది. నది తీర ప్రాంతాల్లో గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలే ఎక్కువగా ఉన్నారు. సాగునీటి అవసరాలు తీర్చి ఆర్థిక వృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలి. నది తీరంలో ప్రాణహిత మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. పర్యాటకంగా గుర్తింపునకు అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

– పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్(టి)

పెన్‌గంగకు నైవేద్యం సమర్పణ



నదిలో తెప్పలు వదులుతున్న కుటుంబం

తాంసి: ఖరీఫ్ సాగు ఆరంభంలో భాగంగా పలు గ్రామాల రైతు కుటుంబాలు జిల్లా సరిహద్దున ప్రవహిస్తున్న పెన్‌గంగ నదికి నైవేద్యాలు సమర్పించారు. ఏటా నిర్వహించే పూజల్లో భాగంగా సోమవారం పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భీంపూర్ మండలం లోని తాంసి(కె), గొల్లఘాట్, వడూర్, అంతర్గాం గ్రామాల శివారులోని ఉన్న నదికి పూజలు చేశారు. అనంతరం తెప్పలను వదిలి పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురియాలని గంగమ్మను వేడుకున్నారు.

ఆర్టీసీ బస్సులో మాయమైన నగలు

కాగజ్‌నగర్ రూరల్: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బంగారు ఆభరణాలు మాయం కావడంతో పట్టణ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూర్ మండలం రెబ్బెన కొత్తగూడెం గ్రామానికి చెందిన చిలుక సుజాత బెజ్జూర్ నుంచి అహెరి వెళ్లే బస్సులో కాగజ్‌నగర్ బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండ్‌లో దిగిన తర్వాత తన బ్యాగులో చూడగా, అందులో పెట్టిన బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. తాను కూర్చున్న సీటు వద్ద వెదకగా నగలు లభించలేదు. పోగొట్టుకున్న నగల విలువ రూ.1,18,750 ఉంటుందని బాధితురాలు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

పల్సి(బి)కి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



సాక్షి స్పందన

తలమడుగు: మండలంలోని పల్సి(బి) గ్రామంలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను ఆదివారం 'పానీపాట్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం రెండు వాటర్ ట్యాంకులతో గ్రామానికి నీటిని సరఫరా చేశారు. ఎంపీడీవో శేఖర్, ఎంపీవో వినోద్ గ్రామానికి వెళ్లి నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



సిందం సాయిచరణ్ | రాచర్ల సంతోషిణి | పెరుగు సాయిరాం | ఇరుసుల జశ్వంత్ | జింక పల్లవి | మల్లెత్తుల సుమంత్ | మాటేటి అర్చన

కాగజ్‌నగర్‌రూరల్: సోమవారం వెలువడిన పాలిసెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన సిందం సాయిచరణ్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 29, వ్యవసాయ రంగంలో 9వ ర్యాంకు, సామల నాగప్రణీత ఇంజనీరింగ్ విభాగంలో 714, వ్యవసాయ విభాగంలో 601 ర్యాంకు, షేక్‌ఖాజాబాబా ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 748 ర్యాంకు సాధించారు. వాసాల పవన్‌సాయి ఇంజనీరింగ్ విభాగంలో 1467, వ్యవసాయ విభాగంలో 800, సెండె అంజలి ఇంజనీరింగ్‌లో 1,769, బంక వాసు ఇంజనీరింగ్‌లో 2,140, వ్యవసాయ విభాగంలో 827వ ర్యాంకు సాధించారు.

కౌటాల: కౌటాల మండలంలోని బోదంపల్లికి చెందిన పెరుగు దేవాజీ, కవిత దంపతుల కుమారుడు సాయిరాం 51వ ర్యాంక్ సాధించాడు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన ఇరుసుల సమ్మయ్య–శ్రీలత దంపతుల కుమారుడు జశ్వంత్ ఎంబైపీసీ స్ట్రీమ్ రాష్ట్ర స్థాయిలో 249, ఎంపీసీలో 781 ర్యాంక్ సాధించాడు.

తాంసి: మండల కేంద్రానికి చెందిన జింక మహేందర్, ప్రేమల దంపతుల కుమార్తె జింక పల్లవి రాష్ట్ర స్థాయిలో 569 ర్యాంక్ సాధించింది.

పాలిసెట్‌లో జిల్లాలో మూడో ర్యాంకు

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన మల్లెత్తుల రాజేశం–సుజాత దంపతుల కుమారుడు సుమంత్ ఎంబైపీసీలో జిల్లాలో మూడో ర్యాంకు, రాష్ట్రంలో 281వ ర్యాంకు సాధించాడు. ఎంపీసీ విభాగంలో సైతం 582వ ర్యాంకు సాధించాడు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన మాటేటి సత్యవతి–రాజయ్య దంపతుల కుమార్తె అర్చన ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించింది. బైపీసీ విభాగంలో 254, ఎంపీసీ విభాగంలో 477 ర్యాంకు సాధించింది.

అర్లి(టి) వద్ద అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు


- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన బస్సు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పంటచేలోకి దూసుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును వెంటనే నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి భీంపూర్ మండలంలోని కరంజి(టి) వైపునకు 32 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. అర్లి(టి), ఇందూర్‌పల్లి గ్రామాల మధ్యలో రోడ్డుపై ఏర్పడిన గుంతను తప్పించే క్రమంలో బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును చాకచాక్యంగా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. మరికొంత దూరం వెళ్తే బస్సు బోల్తాపడి ప్రమాదం జరిగే అవకాశం ఉండేది. ట్రాక్టర్ సాయంతో బస్సును బయటకు తీశారు. అంతర్రాష్ట్ర రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు జోక్యం చేసుకుని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్మీ జవాన్ మృతి



రాజేందర్(ఫైల్)

సిరికొండ: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో అవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ సూర్యవంశి రాజేందర్(32) ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు ఆర్మీ అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాజేందర్ 14 ఏళ్లుగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. భౌతికకాయం మంగళవారం స్వగ్రామానికి చేరుకోనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



నరేందర్ మృతదేహం

ముధోల్: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయి కిరణ్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మేత్రి నరేందర్ (38) తన కొత్త ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం సోమవారం మధ్యాహ్నం గడ్డపారతో తవ్వుతుండగా భూమిలో పాతిన విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కుంటాల: మండలంలోని కల్లూర్–కుంటాల రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌కు చెందిన కుర్ర నందకిషోర్, బొట్టు వంశీ (18)కి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించారు. వంశీ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై వి.రజనీకాంత్ తెలిపారు. నంద కిషోర్ పరిస్థితి కూడా విషమంగానే ఉందన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

జైనథ్: మండలంలోని భోరజ్ పెట్రోల్ బంక్ ఎదురుగా 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మీ వాడకు చెందిన ఇజ్జగిరి ప్రవీణ (38) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ప్రవీణ మండలంలోని పెండల్‌వాడ గ్రామంలోని తన తండ్రి ఇంటికి వచ్చింది. సోమవారం తండ్రి కిష్టుతో కలిసి బైక్‌పై మహాలక్ష్మీ వాడకు వెళ్తుండగా భోరజ్ వద్దకు చేరుకోగానే ఢిల్లీ నుండి నెల్లూరు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ప్రవీణకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందించడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

గుట్కా నిషేధం అమలేది?

- విచ్చలవిడిగా గుట్కా, పాన్ మసాలాల అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



ఖానాపూర్: గుట్కా, పొగాకు తయారీ పదార్థాలను అరికట్టడానికి ప్రభుత్వం గతంలో అధికారిక ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో విక్రయాలు బహిరంగంగానే సాగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యువతపై ప్రభావం చూపుతున్న డ్రగ్స్, గంజాయిపై ఓ వైపు ఉక్కుపాదం మోపుతూనే, మరోవైపు గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ద్వారా ఇటీవల ఉత్తర్వులు జారీ చేయించింది. పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీటి తయారీ, నిల్వలు, పంపిణీ, రవాణా, అమ్మకాలపై పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తున్నట్లు పేర్కొన్నారు. మే 24 నుంచి ఏడాది కాలం పాటు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. తాజా ఉత్తర్వుల్లో ఆహారభద్రత ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఈ నిషేధం అమలులోకి వస్తుందని తెలిపింది.

క్షేత్రస్థాయిలో అమలు కాని ఆదేశాలు..

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయాలని చెప్పి పది రోజులు కావస్తున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమైన గుట్కా విక్రయాలను వెంటనే నిర్మూలించాలని ఇదే అదనుగా బడా వ్యాపారులు సరుకును నల్ల బజారులో అధిక ధరలకు విక్రయించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే చిరు వ్యాపారులకు విక్రయించే గుట్కా ప్యాకెట్లు, సామగ్రిని రెండింతల ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం. ఇదే అదనుగా హోల్‌సేల్ వ్యాపారులతో పాటు పలువురు అక్రమంగా దందా చేసేవారు గుట్కాను వేర్వేరు చోట్ల గోదాంలలో రహస్యంగా నిల్వ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రమాదకర క్యాన్సర్ తదితర వ్యాధుల నుంచి గుట్కా ప్రియులను దూరం చేయాలనే ప్రభుత్వ ఆలోచన ఆదిలోనే హంసపాదుగా మారింది. ఏదేమైనప్పటికీ ఆరోగ్యానికి హాని కలిగించే గుట్కాను నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

గుట్కా విక్రయాలు నిలిపివేయాలి

ఆరోగ్యానికి హానికరమైన గుట్కా విక్రయాలను వెంటనే నిలిపివేయాలి. ప్రభుత్వం నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం. ఆదేశాలు వచ్చి పదిరోజులు అవుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తేనే ఎంతో మంది వ్యాధుల బారిన పడకుండా ఉంటారు.

– రాజశేఖర్, ఖానాపూర్ వాసి

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్లో సోమవారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కొద్ది రోజులుగా రైలు పట్టాలపై పడి ఉన్న ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ ఉండేవాడు. సోమవారం రైలు పట్టాలపై బాటిళ్లు ఏరుకుని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా బెంగళూర్ నుంచి పాట్నా వైపు వెళ్తున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వివరాలకు 8712658596, 8712658605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పదంగా యువకుడు..

మందమర్రిరూరల్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మదిరె శ్యాంసుందర్ (30) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాష్‌రూంలోకి వెళ్లిన శ్యాంసుందర్ ఎంతకూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు డోర్ తొలగించి చూడగా అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే 108కు సమాచారం అందించగా పరిశీలించిన వైద్యసిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



సోన్: మండలంలోని ఐబీ నుంచి మాదాపూర్ వెళ్లే రహదారికి ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన 30 చెట్లు సోమవారం అగ్నికి ఆహుతయ్యాయి. మాదాపూర్, న్యూవెల్మల్, బొప్పారం, పాక్‌పట్ల గ్రామాలలో రైతులు వరికొయ్యలకు నిప్పంటిస్తున్నారు. మంటలు వ్యాపించడంతో చెట్లు దగ్ధమయ్యాయి.